సాక్షి ఒడిశా

సోమవారం । 28 । ఏప్రిల్ । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 6,88,951

బంగారం : 3 గ్రాముల 400 మిల్లీ గ్రాములు

వెండి : 207 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



యోగాతో మానసికవికాసం

జయపురంలో యోగా శిక్షణ శిబిరం ప్రారంభమైంది. సరస్వతి శిశుమందిర ప్రాంగణంలో కార్యక్రమం జరిగింది. - 8లో▸



పేకాటరాయుళ్లు అరెస్టు

ఒడిశాలో ఆంధ్రా పేకాటరాయుళ్లు అరెస్టయ్యారు. వీరు పార్వతీపురం మన్యం జిల్లా వాసులు. - 8లో▸

న్యూస్‌రీల్

భక్తులకు మజ్జిగ వితరణ



భక్తులకు మజ్జిగను పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

రాయగడ: స్థానిక మణిదీప్ మహిళా సంఘం ఆధ్వర్యంలో మజ్జిగౌరీ మందిరం ప్రాంగణంలో ఆదివారం మజ్జిగ వితరణ కార్యక్రమం జరిగింది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని మజ్జిగౌరీ అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించేందుకు మజ్జిగ వితరణ కార్యక్రమం చేపట్టినట్లు క్లబ్ అధ్యక్షురాలు మరాటం సుజన తెలిపారు. ఆదివారం అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందన్న ఉద్దేశ్యంతో క్లబ్ ద్వారా సేవా కార్యక్రమం చేపట్టామన్నారు. ఇటువంటి తరహా సేవా కార్యక్రమాలను తమ క్లబ్ తరచూ నిర్వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వి.స్వాతి, కోశాధికారి కె.లావణ్య, సహాయ కార్యదర్శి కె.సుహాసిని, సభ్యులు కింతలి జ్యోతిర్మణి, క్రిష్ణవేణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి



పోడియా ఆరోగ్య కేంద్రం వద్ద బీమా మృతదేహం

మల్కన్‌గిరి: పాముకాటుతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి మాటేర్ పంచాయతీ కుమారగుడ గ్రామంలో ఆదివారం ఉదయం చోటుచేసుకోగా బీమా మాడీ అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. కేందు ఆకులు (బీడీ ఆకులు) తీయడం కోసం బీమా మాడీ సమీప అడవికి వెళ్లాడు. కింద పడిపోయిన ఆకులు తీస్తుండగా అందులో ఉన్న విష సర్పం కాటు వేసింది. భయంతో కేకలు వేయగా సమీపంలో ఉన్న వారు అక్కడకు చేరుకొని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి.. బాధితుడిని పోడియా ఆరోగ్య కేంద్రానికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు..అప్పటికే బీమా మృతి చెందినట్టు ధ్రువీకరించారు. మృతిని భార్య ఫిర్యాదు మేరకు పోడియా పోలీసుస్టేషన్ అధికారి నిరోధ్ కుమార్ బాష్ ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్యామ్‌లో పడి యువకుడు..



మృతదేహాన్ని వెలికి తీస్తున్న ఫైర్ సిబ్బంది

కొరాపుట్: కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి పాడువా పోలీస్ స్టేషన్ పరిధిలో చంపాపుట్ గ్రామానికి చెందిన బలరాం దురువా (40) ఆదివారం మాచ్‌ఖండ్ నది పరిధిలోని జాలాపుట్ డ్యామ్‌లో పడి మృతి చెందాడు. నందపూర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది మృతదేహాన్ని డ్యామ్ నుంచి వెలుపలికి తీశారు. పాడువా పోలీసులు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గూడ్స్ రైలులో మంటలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాయగడ: రాయిపూర్ నుంచి విశాఖపట్నం పోర్టుకు బొగ్గులోడుతో వెళుతున్న గూడ్స్‌రైలులో మంటలు చెలరేగాయి. శనివారం సాయంత్రం ఈ ఘటన జిల్లాలోని బిసంకటక్ రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. రాయిపూర్ నుంచి బొగ్గు లోడుతో వస్తున్న గూడ్స్ బిసంకటక్ రైల్వే స్టేషన్‌లో కొద్దిసేపు నిలిచింది. కొంతసేపటికి ఒక బోగీ నుంచి పొగలు రావడం గమనించిన రైల్వే సిబ్బంది వెంటనే స్టేషన్ మాస్టార్‌కు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన ఆయన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది.

పిడుగుపాటుకు పశువులు మృతి

రాయగడ: జిల్లాలోని కళ్యాణసింగుపూర్‌లో పిడుగుపాటుకు మూడు పశువులు మృతి చెందాయి. శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఇంటి ముందు ఉన్న చెట్టు కింద పశువులు పచ్చిక మేస్తున్న సమయంలో చెట్టుపై పిడుగు పడింది. దీంతో కింద ఉన్న తమ పశువులు మృతి చెందాయని బాధితులు ఘాసి భొత్ర, సుందర్ కౌసల్యలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

చిరుత, ఎలుగు దాడులు



చిరుత పులి దాడిలో ప్రాణాలతో బయట పడ్డ బాలుడికి చికిత్స చేస్తున్న దృశ్యం



రాములు గొండొకి చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది



రాయగర్ ఆస్పత్రిలో ఎలుగు బంటి బాధితుడు శంకర్ గోండో

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా రాయగర్ సమితి కేంద్రానికి సరిహద్దులోని సరోనా ప్రాంతం అచిదోంగ్రి గ్రామంలోకి ఆదివారం చిరుత పులి ప్రవేశించింది. వీధిలో ఆడుకుంటున్న చిన్నారి బాలుడిపై దాడికి తెగబడింది. పిల్లవాడు భయంతో కేకలు వేయగా గిరిజనులు ఆయుధాలతో పులి పై దాడి చేశారు. వెంటనే ఆ బాలుడిని వదిలి అడవిలోకి పారిపోయింది. బాధితుడిని కాంకేర్ లోని కోమ్లాదేవి ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు చోట ఎలుగు బంట్లు దాడులు

ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా రాయగర్ సమితి కుసుంపూర్ గిరిజన గ్రామానికి చెందిన రాములు గొండో మెంతి ఆకులు సేకరణకు అడవి లోనికి వెళ్లింది. ఒక ఎలుగు బంటి వెనక నుంచి దాడి చేసి కాలు,భుజం మీద గాయ పరిచింది. భయంతో రాములు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న గిరిజనుల రక్షించారు. హత్తిగావ్ పంచాయతీ లెండి గ్రామానికి చెందిన శంకర్ గొండో అడవిలో మెంతి ఆకుల సేకరణకి వెళ్లాడు. అతనిపై కూడా వేరే ఎలుగు బంటి దాడి చేసింది. సహచరులు రక్షించి ఆస్పత్రికి తరలించారు. వీరిద్దరినీ రాయగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హత్తిగాం అటవీ ప్రాంతంలో ఎలుగు బంట్లు అధికంగా వచ్చాయని అటవీ శాఖ అధికారులు సమీప గ్రామాల్లో హెచ్చరికలు చేశారు. కానీ గిరిజనులు జీవనోపాధి కోసం తేనె, కలప, గుగ్గిలం, మెంతి ఆకుల సేకరణ కి వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు.

జగదల్‌పూర్-కొత్తవలస మార్గంలో

వాల్తేర్ డీఆర్‌ఎం పర్యటన



జగదల్‌పూర్ ప్రాంతంలో ఎన్ఎండీసీ లోడింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు



అమగురలో ట్రాకింగ్ పని తీరు అడిగి తెలుసుకుంటున్న అధికారులు



జగదల్‌పూర్ ప్రాంతంలో వాల్తేర్ డిఆర్ఎం బృందం పర్యటన

కొరాపుట్: జగదల్‌పూర్-కొత్తవలస రైల్వే మార్గంలో వాల్తేర్ డీఆర్‌ఎం లలిత్ బోరా పర్యటించారు. ఆదివారం ఈ సెక్షన్‌లో పర్యటనలో భాగంగా జగదల్‌పూర్ ప్రాంతంలోని ఎన్ఎండీసీ మైనింగ్ సైట్‌ని పరిశీలించారు. కిరండోల్, బచేలి ప్రాంతాల నుంచి ముడి ఇనుప రజను ఈ మార్గం గుండా విశాఖపట్నం వైపు వస్తుంది. కొత్తవలస-కొరాపుట్-జగదల్‌పూర్ మార్గంలో ట్రాక్‌లు, మలుపులు, వంతెనలు, క్రాసింగ్స్ పరిశీలించారు. ఎన్ఎండీసీలో వ్యాగన్ల డిశ్చార్జ్, లోడింగ్ ప్రాంతాలను తనిఖీ చేశారు. అమగుర స్టేషన్ లో రైల్వే వ్యాగన్ల సదుపాయం పరిశీలించారు. ఈ పర్యటనలో రైల్వే కన్‌స్ట్రక్షన్స్ చీఫ్ ఇంజినీర్ గౌరీ శంకర్ రావు,పలువురు సీనియర్ రైల్వే అధికారులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో చిక్కుకున్న ప్రయాణికులు



విమానాశ్రయం గేటు ముందు ప్రయాణికుల నిరసన

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉద్రిక్తత నెలకొంది. ప్రయాణికులు విమానాశ్రయంలో చిక్కుకుపోయారు. 12 గంటలు గడిచినా ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకోలేకపోయారు. దీంతో ఆగ్రహించిన ప్రయాణికులు విమానాశ్రయం గేట్ల ముందు గందరగోళం సృష్టించారు. వాతావరణం సమస్యల కారణంగా శనివారం రాత్రి ఢిల్లీ నుంచి కోల్‌కతాకు వెళ్లాల్సిన ఒక ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ విమానం అత్యవసరంగా స్థానిక విమానాశ్రయంలో ఆగింది. వాతావరణం మెరుగుపడినప్పటికీ ఆ విమానయాన సంస్థల విమాన సర్వీసులు తిరిగి ప్రారంభించలేదనే ఆరోపణతో ప్రయాణికులు నిరసన ప్రదర్శించారు. వాతావరణ మార్పు కారణంగా 8 విమానయాన సంస్థల విమానాలు స్థానిక విమానాశ్రయంలో నిలిచి పోయాయి. వాతావరణం కుదుటపడిన తర్వాత 6 విమానాలు తమ ప్రయాణికులతో పాటు గమ్య స్థానాలకు బయల్దేరాయి. మిగిలిన రెండు విమానాలు బయల్దేరక పోవడంతో ఉద్రిక్తత నెలకొంది. 12 గంటలకు పైగా చిక్కుకుపోయిన తర్వాత ప్రయాణికులు సమస్యలను ఎదుర్కొనడంతో గొడవకు దిగారు. ఆగ్రహించిన ప్రయాణికులను విమానాశ్రయ అధికారులు బుజ్జగించి శాంతింప జేశారు. ప్రయాణికులను త్వరగా బయలుదేరేలా హామీ ఇచ్చి కోల్‌కతాకు తీసుకెళ్లడానికి ఏర్పాట్లు చేశారు.

వేర్వేరు సంఘటనల్లో నలుగురు జల సమాధి



కఠొజొడి నదిలో బాలుని కోసం అగ్నిమాపక దళం గాలింపు



ఖాన్ నగర్ వంతెన పైనుంచి బాలుని కోసం ఉత్కంఠతో ఎదురు చూస్తున్న ప్రజానీకం

భువనేశ్వర్: రాష్ట్రంలో రెండు వేర్వేరు సంఘటనలలో నలుగురు బాలురు జల సమాధి అయ్యారు. ఆదివారం ఆయా ప్రాంతాల్లో విషాదం అలుముకుంది. కటక్, నయాగఢ్ జిల్లాల్లో ఈ విషాద సంఘటనలు చోటు చేసుకున్నాయి. నయాగఢ్ జిల్లా దస్‌పల్లా పోలీస్ ఠాణా పరిధి గోడిబిడ గ్రామంలో ముగ్గురు బాలురు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. వీరు ముగ్గురు చెరువులో స్నానం చేస్తూ దురదృష్టవశాత్తు నీట మునిగారు. బాలురును బహదఖల పాడా సాహికి చెందిన 9 ఏళ్ల శుభ ఖిలార్, ఉమాకాంత్ నాయక్, నువాగాంవ్ పోలీస్ ఠాణా పరిధిలోని ఖలమడ గ్రామానికి చెందిన 11 ఏళ్ల ఏళ్ల రితేష్ ప్రధాన్‌గా గుర్తించారు. ఈ ముగ్గురినీ వెలికి తీసి దసపల్లా మెడికల్ సెంటర్‌కు తరలించారు. అక్కడికి చేరుకునే లోపే వీరంతా మరణించారని వైద్యులు ప్రకటించారు.

కఠొజొడి నదిలో బాలుడు గల్లంతు

కటక్‌లోని ఖాన్ నగర్ సమీపంలోని కఠొజొడి నదిలో కొట్టుకుపోయి 14 ఏళ్ల మైనర్ బాలుడు సూర్యకాంత్ మాఝీ గల్లంతయ్యాడు. నగరంలోని బేతాబింధాని సాహికి చెందిన సూర్యకాంత్ స్నానం చేస్తుండగా బలమైన ప్రవాహంలో చిక్కుకుని గల్లంతయ్యాడు. అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి బాలుని గాలించి ఖాన్ నగర్ రైల్వే వంతెన సమీపంలోని నది నుంచి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పాక్ మహిళ తిరుగు ప్రయాణం

భువనేశ్వర్: పాకిస్తాన్ జాతీయురాలు నగ్మా యూసుఫ్ ఆదివారం భువనేశ్వర్ నుంచి బయలుదేరింది. స్వదేశానికి తిరిగి పంపడానికి ఇక్కడి అధికారులు గుర్తించిన పొరుగు దేశానికి చెందిన 12 మంది పాకిస్తాన్ పౌరులలో ఆమె ఒకరు. 2008 సంవత్సరంలో భారతీయ పౌరుడు మొహమ్మద్ నిజాముద్దీన్‌ను వివాహం చేసుకుంది. తర్వాత ఆమె దీర్ఘకాలిక వీసాపై స్థానిక బీజేబీ నగర్ ప్రాంతంలో నివసిస్తోంది. వీసా పునరుద్ధరణ కోసం చేసిన దరఖాస్తులు తిరస్కరించిన తర్వాత ఆమె ఇటీవలే విజిటర్ వీసా పొందింది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో విజిటర్ వీసా గడువు ముగియడానికి కొన్ని రోజుల ముందుగా ఆమె కమిషనరేట్ పోలీస్‌లోని విదేశీయుల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఎగ్జిట్ పర్మిట్ కోసం దరఖాస్తు చేసుకుంది. అప్పటి నుంచి ఆ దరఖాస్తు పెండింగ్‌లో ఉంది. ఈ నెల 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లోని బైసరన్ పచ్చిక బయళ్లలో పర్యాటకులపై జరిగిన దారుణమైన దాడిలో 26 మంది మరణించిన తర్వాత కేంద్ర హోం వ్యవహారాల శాఖ ఆమె దేశం విడిచి వెళ్లమని కోరుతూ దాఖలు చేసిన దరఖాస్తును ఆమోదించింది. 48 గంటల్లోగా దేశం విడిచి వెళ్లమని ఆమెకు నోటీసు ఇచ్చింది.

సీనియర్ సిటిజన్స్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి

కొరాపుట్: సీనియర్ సిటిజన్స్ భవన నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని దసరాపాద నుంచి జిల్లా కేంద్ర ఆస్పత్రికి వెళ్లే మార్గంలో నిర్మించనున్న భవన నిర్మాణ పనులకు సంఘం అధ్యక్షుడు రాధా నాథ్ బెహరా ఆదివారం ప్రారంభ పూజలు చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి భూమి పూజ చేశారు. గత ఎమ్మెల్యే సదాశివ ప్రదాని తన కోటా నిధులు రు.4 లక్షలు ఇవ్వగా ప్రస్తుత ఎమ్మెల్యే గౌరీ మరో రు.4 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఈ భవనం కోసం ఐదు సెంట్ల స్థలాన్ని కేటాయించింది.

ఇంటికి కూరలు తేవాలి కదా..!



కొరాపుట్-రాయగడ జిల్లాల మధ్య ఆకు కూరలు బేరమాడుతున్న నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర మజ్జి

కొరాపుట్: దేశానికి రాజైనా ఇంటికి యజమానే కదా. సోమవారం నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర మజ్జి రాయగడ జిల్లా పర్యటనకి పయనమయ్యారు. మార్గ మధ్యంలో ఆకు కూరలు కనిపించాయి. తన కాన్వాయ్ ఆపించి వాటిని బేరమాడి కొనుక్కున్నారు. నిత్య ప్రజా జీవితంలో సతమతమవుతున్నప్పటికీ తాను కూడా ఒక ఇంటికి యజమాని అని గుర్తుకు తెచ్చుకొని ఆ ఆకుకూరలు సంచిలో వేసుకొని బయలు దేరారు.

29, 30 తేదీల్లో చందనోత్సవాలు



పూజలందుకుంటున్న శ్రీలక్ష్మీనృసింహ స్వామి



దేవాలయం

రాయగడ: జిల్లాలోని కొలనార సమితి పరిధిలో గల అమలాభట్టకు సమీపంలో ఉన్న శ్రీక్షేత్ర టౌన్‌షిప్‌లో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ నృసింహ ఆలయంలో ఈ నెల 29, 30వ తేదీల్లో అక్షయ తృతీయను పురస్కరించుకుని చందనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త దూడల శ్రీనివాస్ తెలియజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మంగనాథ్ ఆచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదేవిధంగా 30న ఉదయం ఏడు గంటలకు చందనాభిషేకం, తీర్థ ప్రసాద సేవ కార్యక్రమాలు అలాగే సాయంత్రం 6 గంటల నుంచి శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారి కల్యాణ మహోత్సవాలు జరుగుతాయి.

రాష్ట్రంలో అకాల వర్షాలు

- 9 జిల్లాలకు ఐఎండీ నారింజ రంగు, 21 జిల్లాలకు పసుపు రంగు హెచ్చరిక జారీ



భువనేశ్వర్: భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రాంతీయ కేంద్రం రాష్ట్రంలోని 30 జిల్లాల్లో వర్ష సూచన జారీ చేసింది. 9 జిల్లాలకు నారింజ, 21 జిల్లాలకు పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది. మే నెల 1వ తేదీ వరకు ఈ వాతావరణం కొనసాగే అవకాశం ఉంది. దీంతో రాష్ట్రంలో పగటి పూట ఉష్ణోగ్రత 3 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ తగ్గుతుందని భావిస్తున్నారు.

నారింజ హెచ్చరిక

సుందర్‌గఢ్, కెంజొహర్, మయూర్‌భంజ్, బాలాసోర్, భద్రక్, గజపతి, గంజాం, రాయగడ మరియు కొరాపుట్ జిల్లాల్లో మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఉపరితల గాలుల వేగం గంటకు 50 నుంచి 60 కిలోమీటర్లకు చేరుకుంటుంది. ఈ ప్రాంతాల్లో భారీ వర్షాలతో కూడిన వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

పసుపు హెచ్చరిక

జాజ్‌పూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, ఝార్సుగుడ, బర్‌గడ్, సంబల్‌పూర్, దేవ్‌గడ్, అంగుల్, ఢెంకనాల్, పూరీ, ఖుర్దా, నయాగడ్, సోన్‌పూర్, బౌధ్, నువాపడా, బొలంగీర్, కలహండి, కంధమల్, నవరంగ్‌పూర్, మల్కన్‌గిరి జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన కురిసే అవకాశం ఉంది.

కొండలెక్కి.. వాగులు దాటి



దట్టమైన అటవీ ప్రాంతంలో నడుస్తున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత



వీధి అరుగుల మీద గిరిజనుల సమస్యలు తెలుసుకుంటూ



వీధి దీపాల వద్ద సమావేశం

కొరాపుట్: దండకారణ్యంలోని దుర్గమ అటవీ ప్రాంతాలలో ఉండే గిరిజన గూడేంలను లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత సందర్శించారు. ఆదివారం కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి గొడుగుడ గ్రామ పంచాయతీ లచ్చమణి, తులమట్టంగి, ఉప్పర్ మట్టంగి గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాలకు రోడ్డు మార్గం లేదు. కనీసం బైక్ వెళ్లడానికి కూడా అవకాశం లేదు. దీంతో ఎమ్మెల్యే కాలి నడకన కొండలు ఎక్కి, వాగులు దాటి గ్రామాలకు చేరుకున్నారు. పలు చోట్ల గిరిజనులతో మీటింగ్‌లు ఏర్పాటు చేసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇళ్ల ముందు ఉన్న అరుగులే వేదికలయ్యాయి. స్వాతంత్ర్య అనంతరం ఇంత వరకు ఆ గ్రామాలకు ఎవరూ వెళ్లలేదు. పవిత్ర శాంత తొలి ఎమ్మెల్యే. తులమట్టంగి వద్ద ఉన్న పెద్ద జలపాతాన్ని కూడా సందర్శించి రోడ్డు వేయాలని పర్యాటక శాఖకు లేఖ రాశారు.

గుప్తేశ్వరంలో ఎంపీ పర్యటన



గుప్తేశ్వరంలో పర్యటిస్తున్న నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర మజ్జి



క్షేత్రంలో పూజలు చేస్తున్న దృశ్యం



కొండలపై జీవిస్తున్న గిరిజనులకు ఆయుష్మాన్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొరాపుట్: సహజసిద్ధ పుణ్య క్షేత్రం గుప్తేశ్వరంలో నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర మజ్జి పర్యటించారు. ఆదివారం ఉదయం కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితి రామగిరి పంచాయతీలో ఉన్న ఈ క్షేత్రం సందర్శించారు. అక్కడ జరుగుతున్న క్షేత్ర అభివృద్ధి పనుల పురోగతి సమీక్షించారు. సత్వరం పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ ప్రాంతంలోని దండకారణ్య కొండల్లో నివసిస్తున్న గిరిజనులకు ఆయుష్మాన్ కార్డులు పంపిణీ చేశారు. పర్యటనలో కొట్‌పాడ్ ఎమ్మెల్యే రుపుదర్ బోత్ర, పార్టీ నాయకులు,వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

42 కిలోల గంజాయి స్వాధీనం

• నలుగురి అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: జిల్లాలోని రామనగుడ పోలీసులు శనివారం నిర్వహించిన దాడుల్లో 42 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీంతో సంబంధం ఉన్న నలుగురిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో జిల్లాలోని గుడారి పోలీస్ స్టేషన్ పరిధిలో మిచికిలింగి గ్రామానికి చెందిన బాసుదేవ్ బిడిక, అజయ్ కద్రక, మహారాష్ట్రకు చెందిన తుషార్ దీపక్ ఒఘాడేతో సహా మరో మైనర్ బాలుడు ఉన్నారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో పెనకాం పంచాయతీలోని తమింగి గ్రామం సమీపంలో నలుగురు వ్యక్తులు రెండు బస్తాలు మోసుకుంటూ వెళుతుండగా వారిని ఆపి తనిఖీ చేయగా అందులో గంజాయి పట్టుబడింది. ఈ మేరకు కేసును నమోదు చేసిన పోలీసులు నిందితులను కోర్టుకు తరలించారు.

ఆంధ్రా పేకాటరాయుళ్లు అరెస్టు



బందుగాం పోలీసులు పట్టుకున్న ఆంధ్రా పేకాట రాయుళ్లు

కొరాపుట్: ఒడిశాలో ఆంధ్రా పేకాట రాయుళ్లు అరెస్టయ్యారు. ఆదివారం కొరాపుట్ జిల్లా బంధుగాం సమితి అలమండ గ్రామ సమీపంలో చీడి వలస అటవీ ప్రాంతంలో జోరుగా పేకాట జరుగుతున్నట్లు లక్ష్మీపూర్ ఎస్డీపీఓ బిరంచి నారాయణ్ జగత్‌కి సమాచారం వచ్చింది. వెంటనే బందుగాం పోలీసులు దాడి చేసి 14 మందిని అరెస్ట్ చేసి బందుగాం పోలీస్ స్టేషన్‌కి తరలించారు. వీరి నుంచి రెండు కార్లు, 14 సెల్ ఫోన్లు, 10 బైక్‌లు, రూ.75 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా పార్వతీపురం మన్యం జిల్లా వాసులుగా గుర్తించారు.

206 మందికి వైద్య సేవలు



మందులు అందజేస్తున్న వైద్యులు, సేవా సమితి సభ్యులు

రాయగడ: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో కొలనార సమితి దొందిలి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణుడు ఎం.సురేష్ కుమార్, వైద్యులు జి.వి.రమణ, లోక్‌నాథ్ రాజు, సౌమ్య రంజన్ నాయక్, హిరాచంద్ పట్నాయక్, మధుస్మిత జైన్, ఫార్మాసిస్టులు ఎ.మురళీ ధర్ బెహర, ప్రమోద్ కుమార్ సాహు, మినకేతన్ కొండగిరి, తదితరులు పాల్గొన్నారు. దొందిలి పరిసర గ్రామాలకు చెందిన 206 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులను అందించారు. ఇందులో 26 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్ల కోసంసం పితామహాల్ వద్ద గల ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు తరలించినట్లు శిబిరం నిర్వాహకులు డాక్టర్ ఎల్.ఎన్.సాహు తెలియజేశారు.

జోషితకు డీఈఓ అభినందనలు

మందస: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 597 మార్కులు సాధించిన హరిపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కంచరాన జోషితను డీఈఓ ఎస్.తిరుమల చైతన్య ఆదివారం ఆమె ఇంటికి వెళ్లి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించి జిల్లా ఖ్యాతిని పెంచిందని అన్నారు. తల్లిదండ్రులు లేపాక్షి, మాధవరావులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ బిడ్డను ప్రభుత్వ పాఠశాలలో చదివించడం ఆదర్శప్రాయమన్నారు. ఈ సందర్భంగా జోషితకు రూ.10వేలు నగదు బహుమతి అందజేశారు. విజయానికి కారణమైన హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు.

భావనపాడు తీరం సందర్శన



సముద్రంలోకి తాబేలు పిల్లలను విడిచి పెడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

సంతబొమ్మాళి: భావనపాడు తీర ప్రాంతాన్ని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. ట్రీ ఫౌండేషన్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం 420 తాబే లు పిల్లలను సముద్రంలో విడిచిపెట్టారు. కార్యక్రమంలో భావనపాడు సర్పంచ్ బుడ్డ మోహన్‌రెడ్డి, ట్రీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ సోమేశ్వరరావు, ఫారెస్ట్ సెక్షన్ అధికారి నరేంద్ర, బీట్ అధికారి జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక వికాసం



యోగా సాధనలో అభ్యసకులు



యోగా ప్రాధాన్యతను వివరిస్తున్న డాక్టర్ దేవ కాంత బెహర



శిక్షణలో పాల్గొన్న ప్రజలు

జయపురం: యోగాతో మానసిక వికాసం సాధ్యమని వక్తలు అన్నారు. జయపురం అరవిందనగర్‌ని సరస్వతీ శిశు విద్యామందిర ప్రాంగణంలో యోగా మహోత్సవ సమితి ఒడిశా ప్రాంతీయ యోగ శిక్షణ శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. శిబిరంలో ఒడిశా పశ్చిమ ప్రాంతంతో జిల్లాలు, కొరాపుట్ జిల్లాతోపాటు ఆరు జిల్లాల యోగా కోఆర్డినేటతో పాటు 50 మందికి పైగా యోగా శిక్షకులు హాజరయ్యారు. వారు ఉత్తమ యోగా శిక్షణ పొందారు. శిక్షకులకు శిక్షణ ఇచ్చిన వారు భారతీయ యోగా ప్రదర్శనలో అమూల్య ప్రతిభ ఉన్న వారు అని యోగా మహోత్సవ సమితి ప్రాంతీయ అధికారి, సాధారణ కార్యదర్శి డాక్టర్ దేవకాంత బెహర వెల్లడించారు. యోగాతో శారీరక, మానసిక వికాసంతో పాటు ఆధ్యాత్మిక భావాలు కలుగుతాయన్నారు. యోగాపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. యోగా శిక్షకులు సరోజ్ కాంత మహాపాత్రో, ప్రాంతీయ కోఆర్డినేటర్ అమియ దాస్, కొరాపుట్ జిల్లా యోగా మహోత్సవ సమితి కోఆర్డినేటర్ సురేష్ నంద పాల్గొన్నారు. యోగా శిక్షణ శిబిరంలో మనోరంజన్ ప్రధాన్, జానకీ పాణిగ్రాహి ప్రసంగించారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



విజేత జట్టుకు నగదు బహుమతిని అందజేస్తున్న నెక్కంటి భాస్కరరావు

• రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి

రాయగడ: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ సాధ్యమని రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు అన్నారు. సదరు సమితి పరిధిలోని బొడొచాందిలి గ్రామంలో మార్చి 26 నుంచి ప్రారంభమైన ఫెండ్రీ క్రికెట్ టోర్నమెంటు ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు ఇటువంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వారి ప్రతిభను చాటుకోవడంతో పాటు భవిష్యత్‌ను ఉజ్వలంగా మార్చుకునేందుకు ఇలాంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదివాసీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంటుల్లో వివిధ ప్రాంతాల నుంచి 32 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు పెద్దింటి తపన్ కుమార్ అన్నారు. ఆదివారం నాడు జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భాగంగా సెరిగడు, ఎస్ పితేసు జట్లు తలపడగా సెరిగుడ విజేతగా నిలిచిందన్నారు. జేకేపేపర్ మిల్ సౌజన్యంతో కొనసాగిన టోర్నమెంటులో విజేత జట్టుకు ట్రోఫీతో పాటు 30 వేల రూపాయల నగదు, రన్నర్ జట్టుకు ట్రోఫీ, రూ. 20 వేలు ముఖ్యఅతిథిగా హాజరైన నెక్కంటి అందించారు. మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక, బీజేడీ సీనియర్ నాయకుడు దూడల శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

పర్లాకిమిడిలో ట్రాఫిక్ కంట్రోల్‌పై చర్యలు



రాజవీధిలో జగన్నాథ మందిరం వద్ద ట్రాఫిక్ కంట్రోల్ పైలాన్



రాజవీధి కూడలి వద్ద ట్రాఫిక్ పోలీసుల నియామకం

పర్లాకిమిడి: ట్రాఫిక్ సమస్యపై ఏప్రిల్ 18న సాక్షి ప్రచురించిన కథనంపై జిల్లా పోలీసుశాఖ స్పందించింది. శుక్రవారం నుంచి పాత కోర్టు జంక్షన్, మార్కెట్, హైస్కూల్ జంక్షన్, అగ్నిమాపక కేంద్రం జంక్షన్, రాజవీధి దిగువన వన్‌వే ట్రాఫిక్‌ను అమలు చేశారు. పర్లాకిమిడిలో వాహనదారులు అస్తవ్యస్తంగా వాహనాలు నడుపుతుండటంతో అనేక మందికి గాయాలవుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి కూడలి వద్ద ట్రాఫిక్ కంట్రోల్ పోస్టును ఏర్పాటు చేశారు. అలాగే వన్‌వే ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రోడ్డు మధ్య డివైడర్‌లను ఏర్పాటు చేశారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని సైన్‌బోర్డులు ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ మందిర ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న భక్తులు



ఛత్తీష్‌గఢ్ రాష్ట్రం నుంచి వచ్చిన భక్తులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్పాడ్ సమితి దమణహండిలో శనివారం హనుమాన్ మందిర ప్రతిష్ట ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. మూడు రోజులుగా నిర్వహించిన మందిర ప్రతిష్ట వేడుకల్లో భాగంగా కలశ జాత్ర, గోపూజ, పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 26వ జాతీయ మార్గంలో గల దమణ హండిలో నిర్వహించిన హనుమాన్ మందిర ప్రతిష్ట ఉత్సవాల్లో స్థానికులే కాకుండా సరిహద్దున గల ఛత్తీష్‌గఢ్ రాష్ట్ర సుకుమ రాజ కుమార్ జయదేవ్, అతని కుమారుడు బిదిత దేవ్, జయపురం రాజమాత సబితా దేవి, కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూసు భోత్ర, కొట్‌పాడ్ సమితి బీడీఓ బిక్రమ దొర, ఎంపీ ప్రతినిధి రామేశ్వర జెన, కొట్‌పాడ్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు రంజిత్ కుమార్ పట్నాయక్, కొట్‌పాడ్ సమితి ఉపాధ్యక్షుడు బాబులి పాణిగ్రాహి పాల్గొన్నారు. కొరాపుట్ జిల్లా గ్రామాల నుంచే కాకుండా ఛత్తీష్‌గఢ్ రాష్ట్ర ప్రజలు, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు. తాపస్ కుమార్ పాడీ, సంజీవ కుమార్ బిశాయి, ఉమేష్ చంద్ర బ్రహ్మ, తీర్థబాసి చౌదరి, గౌరవ కుమార్ పర్యవేక్షించారు.

అనాథాశ్రమం ప్రారంభం

పర్లాకిమిడి: అనాథ పిల్లలను చేరదీసి వారికి ఆహారం, ప్రాథమిక వైద్యం, విద్యను అందించేందుకు అనాథాశ్రమాన్ని పీపుల్ ఫార్వర్డ్ ఫౌండేషన్ సంస్థ గజపతి జిల్లా రాయఘడ బ్లాక్‌లో డోంబాల్ పంచాయతీ మండల సాయి వద్ద ఆదివారం జిల్లా ఎస్పీ జ్యోతింద్ర నాథ్ పండా ప్రారంభించారు. ఈ అనాథ ఆశ్రమం ప్రారంభోత్సవానికి డోంబాలో పంచాయతీ సర్పంచు బిశ్వనాథ భుయ్యాన్, సంస్థ అధ్యక్షురాలు బినీతా పండా, కార్యదర్శి సత్యజిత్ బరువా, జిరంగో పోలీసుస్టేషన్ అధికారి బి.రమణ, స్థానికులు పాల్గొన్నారు. గజపతి జిల్లా నుంచి వచ్చిన అనాథ పిల్లలను భువనేశ్వర్‌లో పీపుల్ ఫార్వర్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తొలుత ప్రారంభించారు. అనంతరం గజపతిజిల్లా రాయఘడ బ్లాక్ మండల సాయిలో ప్రారంభిస్తున్నందుకు జిల్లా ఎస్పీ జ్యోతింద్రనాథ్ పండా అభినందించారు. ప్రస్తుతం మండల సాయి అనాథ హాస్టల్‌లో 20 మంది బాలలు ఉంటున్నారు. వారికి అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా ఎస్పీ పండా అన్నారు.

ఆయుష్మాన్ కార్డులు పంపిణీ



సునాబెడాలో కార్డులను పంపిణీ చేస్తున్న సిబ్బంది

కొరాపుట్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అమల్లోకి తెచ్చిన ఆయుష్మాన్ ఆరోగ్య బీమా కార్డుల పంపిణీ ప్రక్రియ జోరుగా జరుగుతోంది. ఆదివారం కొరాపుట్ జిల్లా సునాబెడా పట్టణంలోని 18వ వార్డులో పంపిణీ చేపట్టారు. కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. గతంలో ఉన్న బీజూ ఆరోగ్య బీమా కార్డులను తొలగించి కొత్త ప్రభుత్వం వీటిని అమలు లోనికి తెచ్చింది. ఈ కార్డు ఉన్న ప్రతి వ్యక్తికి రూ. 10 లక్షల వరకూ వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తోంది.

పాలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన పాలిసెట్–2025 ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల ఇన్‌చార్జి బి.జానకిరామయ్య ఆదివారం చెప్పారు. శ్రీకాకుళం, టెక్కలి రెండు డివిజన్లలో పరీక్ష నిర్వహణ ఈ నెల 30న ఉంటుందని అన్నారు. శ్రీకాకుళం డివిజన్‌లో 25 పరీక్ష కేంద్రాల్లో 6952 మంది, టెక్కలి డివిజన్‌లో 14 పరీక్ష కేంద్రాల్లో 4500 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నా రని చెప్పారు. జిల్లాలో మొత్తం 39 పరీక్ష కేంద్రాల్లో 11,452 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని వెల్లడించారు. విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని అన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు.

రేపు జిల్లా స్థాయి అండర్-23 బాస్కెట్ బాల్ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాస్థాయి అండర్–23 బాలబాలికల బాస్కెట్ బాల్ జట్ల ఎంపికలు ఈనెల 29వ తేదీన జరుగుతాయని బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానం వేదికగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఈ ఎంపికలు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొన్న బాల, బాలికలు 23 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. బాస్కెట్‌బాల్ కోచ్ జి.అర్జున్ రెడ్డి మాట్లాడుతూ ఎంపికలలో పాల్గొన్న క్రీడాకారులు విధిగా తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9949291288 నంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

నీట్ సూపర్ స్పెషాలిటీ పరీక్షలో టాపర్ యష్ జైన్



ఆత్మీయుల అభినందనలు అందుకుంటున్న యష్ జైన్

భువనేశ్వర్: బొలంగీర్ జిల్లా కంటాబంజీకి చెందిన యష్ జైన్ నీట్ సూపర్ స్పెషాలిటీ (ఎస్ఎస్) పరీక్షలో అగ్రస్థానంలో నిఉత్తీర్ణత సాధించాడు. ఆయన జనరల్ సర్జరీలో స్పెషలిస్ట్. ముంబైలోని కేఈఎం హాస్పిటల్ నుంచి ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. ఆ తర్వాత నాగ్‌పూర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యను పూర్తి చేశాడు. గత మూడేళ్లుగా ఆ ఆస్పత్రిలో రోగులకు సేవ చేస్తున్నాడు. నీట్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్షలో రాష్ట్రంలో కంటాబంజికి చెందిన యష్ కుమార్ జైన్‌కు విపక్ష నేత నవీన్ పట్నాయక్ అభినందనలు తెలిపారు. తన వృత్తి జీవితంలో మరింత ప్రకాశవంతంగా ప్రకాశించి రాష్ట్రం గర్వపడేలా చేయాలని నవీన్ పట్నాయక్ ఆకాంక్షించారు.

సాహిత్య సేవలు ప్రశంసనీయం



వేదికపై ఎమ్మెల్యే బాహినీపతి, సౌమ్యరంజన్ పట్నాయక్ తదితరులు



మాధవ చౌధురిని సన్మానిస్తున్న సాహితీ ఘర్ ప్రతినిధులు

జయపురం: ప్రముఖ ఒడియా దినపత్రిక సంబాద్ ద్వారా నిర్వహిస్తున్న సంబాద్ సాహిత్య ఘర్ ఒడియా సాహిత్య ప్రగతికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి అన్నారు. ఆదివారం స్థానిక విక్రమదేవ్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన సంబాద్ సాహిత్య ఘర్ ఎనిమిదో వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. సంబాద్ సాహిత్య ఘర్ జయపురం అధ్యక్షులు ఉదయ శంకర జాని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాహినీపతి ప్రసంగిస్తూ సంబాద్ గ్రూపు అధినేత, మాజీ ఎంపీ సౌమ్యరంజన్ పట్నాయక్ సాహిత్య ప్రగతి, పరిరక్షణకు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. అంతేకాకుండా రక్త సేకరణకు ప్రత్యేక ఉద్యమం చేపట్టి సమాజానికి అనేక సేవలు అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సంబాద్ సాహిత్య ఘర్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ శుభశ్రీ లెంక, సంబాద్ మీడియ సంస్థల అధినేత, మాజీ ఎంపీ సౌమ్యరంజన్ పట్నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు, సాహితీప్రియుడు మాధవ చౌధురిని సత్కరించారు.

సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కేసీసీ బ్యాంక్ ఉద్యోగులు

జయపురం: కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ ఉద్యోగుల సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. సమస్యలు పరిష్కరించాలని కేసీసీ బ్యాంక్ ఉద్యోగులు పట్టణ ప్రధాన మార్గాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. హోటల్ ఉడ్ నుంచి ప్రారంభించన ర్యాలీ బ్యాంక్ ప్రధాన కార్యాలయానికి చేరింది. కార్యాలయ సభాగృహంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆల్ ఇండియా కోఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సాధారణ కార్యదర్శి కామ్రేడ్ కె.వి.ఎస్ రవికుమార్ పాల్గొన్నారు. యూనియన్ పతాకాన్ని ఎగురవేశారు. బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ జయపురం అధ్యక్షుడు దిగంబర నాయక్ ఉద్యోగుల సమస్యలపై ప్రసంగించారు. సాధారణ కార్యదర్శి అరుణ కుమార్ సాహు యూనియన్ వార్షిక నివేదికను సభకు సమర్పించారు. కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర చంద్ర పాణిగ్రాహి, సీనియర్ డైరెక్టర్ రమాకాంత రౌళోలు ప్రసంగిస్తూ.. బ్యాంక్ ఉన్నతికి ఉద్యోగులు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమన్నారు. వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా కోఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సాధారణ కార్యదర్శి కామ్రేడ్ కె.వి.ఎస్. రవికుమార్, సహాయ కార్యదర్శి అఖిల ఒడిశా సహకార బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ సాధారణ కార్యదర్శి ప్రబోధ్ కుమార్ మిశ్ర, ప్రెసిడెంట్ సంజీవ్ పతి, కార్యదర్శి బిష్ణు ప్రసాద్ మహాపాత్రో తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు.

సహకార బ్యాంక్‌ల అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఈశ్వర్ పాణిగ్రాహి, రవి కుమార్, దిగంబర్ నాయక్, ప్రభాత్ మిశ్ర తదితరులు

కొరాపుట్: సహకార రంగ బ్యాంక్‌ల అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలని కొరాపుట్ సెంట్రల్ కో ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి పిలుపునిచ్చారు. ఆదివారం జయపూర్ కేసీసీ బ్యాంక్ ఆవరణలో జరిగిన రాష్ట్ర సహకార సంఘ బ్యాంక్ ఉద్యోగుల జనరల్ బాడీ సమావేశంలో ప్రసంగించారు. ప్రైవేట్ రంగ బ్యాంక్‌ల నుంచి వస్తున్న సవాళ్లను ఎదుర్కోవడానికి సహకార బ్యాంక్‌లు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. తొలుత పెహల్గాం మృతులకు నివాళులర్పించారు. ఈ కార్యాక్రమంలో ఆల్ ఇండియా కోఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరి కె.వి.ఎస్.రవికుమార్, రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్, కార్యదర్శులు ప్రభాత్ మిశ్ర, కేసీసీ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రెసిడెంట్ దిగంబర్ నాయక్, కార్యదర్శి అరుణ్ మిశ్ర, 17 బ్యాంక్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కలర్ బెల్ట్ ప్రమోషన్



తైక్వాండోను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పర్లాకిమిడి: జిల్లా తైక్వాండ్ అకాడమీ తరపున స్థానిక గుండిచా మందిరంలో కలర్‌బెల్ట్ ప్రమోషన్ పరీక్షలు ఆదివారం అకాడమీ కార్యదర్శి కార్తీక్ చంద్ర మహాపాత్రో ఆధ్వర్యంలో జరిగాయి. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా బరంపురం తైక్వాండో అకాడమి నుంచి సత్యనారాయణ త్రిపాఠి, రాయగడ జిల్లా గుణుపురం నుంచి గణేష్ చంద్ర మహాపాత్రో వ్యవహరించారు. మొత్తం 99 మంది క్రీడాకారులు వైట్ బెల్టు, ఎల్లో స్ట్రిప్, గ్రీన్, బ్లూ స్ట్రిప్‌లకు పోటీపడ్డారు. వారిలో 89 మంది అర్హత సాధించినట్టు అకాడమీ కార్యదర్శి కార్తీక్ మహాపాత్రో తెలిపారు. విద్యార్థులకు వచ్చేనెల నాలుగో తేదీన బెల్టులు ప్రదానం చేస్తామన్నారు.



గజపతి తైక్వాండ్ అకాడమీ ఆధ్వర్యంలో కలర్ బెల్ట్ ప్రమోషన్

క్లుప్తంగా

గడ్డివాములు, ధాన్యం దగ్ధం



బాడంగిలో కాలిపోతున్న గడ్డివాములు

బాడంగి: మండలకేంద్రం బాడంగి పోలీస్‌స్టేషన్ పక్కన రైతు మరడాన చంద్రినాయుడుకు చెందిన మూడు గడ్డివాములు, 80 మూటల ధాన్యం కాలిపోయినట్లు వీఆర్‌ఓ కృష్ణ చెప్పారు. ప్రమాదం ఎలా జరిగిందో తెలియనప్పటికీ మధ్యాహ్నం గడ్డికుప్పల్లో నుంచి పొగ, మంటలు రావడంతో రైతుకు సమాచారం ఇచ్చి ఒక్కసారిగా గ్రామస్తులు పరుగు పెట్టి నీటితో మంటలను ఆర్పేందుకు ప్రయత్నంచేశారు. అయినప్పటికీ 40 క్వింటాళ్ల వరకు ధాన్యం మూటలు కాలిపోగా ఆస్తినష్టం సుమారు రూ.80వేలు ఉంటుందని, గడ్డివాములతో కలిపి లక్ష రూపాయలవరకు నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. అయితే సుమారు మూడేళ్లనుంచి ఆదే రైతుకు చెందిన గడ్డివాములు, ధాన్యం కాలిపోతుండడం గమనార్హం.

తప్పిన ప్రాణాపాయం

- తిరుపతిలో ప్రమాదం



ప్రమాదానికి గురైన వాహనం,(ఇన్‌సెట్లో) చికిత్స పొందుతున్న హారిక

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేట గ్రామానికి చెందిన మీసాల మహేష్, భార్య రాధ, కుమార్తెలు హారిక, ఉద్వితలు ఆదివారం ఉదయం తిరుమల నుంచి తిరుపతికి ప్రయాణిస్తున్న వాహనం టైర్ పంక్చర్ కావడంతో పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో మహేష్, రాధ, ఉద్వితలు చిన్న చిన్న గాయాలతో బయటపడగా, హారికకు తలకు దెబ్బతగిలి వాపు రావడంతో తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

పెరుగుతున్న ఏనుగుల విధ్వంసం



నేరడి వంశధార తీరంలో ఏనుగుల దాడిలో ధ్వంసమైన నాటు పడవ

భామిని: మండలంలోని నేరడి-బి గ్రామ సమీప వంశధార నదీ తీరంలో నిలిపి ఉన్న నాటు పడవను ఏనుగుల గుంపు ధ్వంసం చేసింది. నేరడి బ్యారేజీకి వెళ్లిన ఏనుగుల గుంపు శనివారం రాత్రి తిరుగు ముఖం పడుతూ నేరడి గ్రామం వద్ద ఉన్న నాటు పడవను పాడు చేసి ముక్కలు చేశాయి. తమ నాటు పడవను కళింగ పట్నం నుంచి గతంలో తెప్పించానని, జీవనోపాధి కోల్పోయానని జాలరి చెక్కా శ్రీను ఫారెస్టు అధికారుల ముందు వాపోయాడు. నాటు పడవలోని ఫ్లడ్ జాకెట్లను పాడు చేశాయంటూ చూపించారు. అలాగే స్వీట్‌కార్న్ పంటలను తినివేసినట్లు రైతులు వాపోయారు.

కారు, వ్యాన్ ఢీకొని ఒకరి మృతి



మృతిచెందిన కారు డ్రైవర్ సురేష్

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి-మరడాం మధ్యలో జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్.బూర్జవలస ఎస్సై రాజేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పార్వతీపురం నుంచి గజపతినగరం వస్తున్న కారు మరడాం-కోమటిపల్లి మధ్యలో గజపతినగరం నుంచి రామభద్రపురం వైపు వెళ్తున్న కోళ్ల వ్యాన్‌ను ఢీకొంది. దీంతో తూర్పు గోదావరి జిల్లా గౌరీపట్నం మండలం తెనుకమెట్టకు చెందిన కారు డ్రైవర్ పల్లి సురేష్(45) అక్కడికక్కడే మృతి చెందగా కారులో ఉన్న మరో ముగ్గురికి స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చందనోత్సవానికి ఆర్టీసీ అదనపు సర్వీసులు

విజయనగరం అర్బన్: సింహాచలంలో ఈ నెల 30వ తేదీన జరిగే వరాహలక్ష్మీ స్వామి చందనోత్సవం సందర్శన కోసం ప్రత్యేక బస్సు సర్వీసులు నిర్వహిస్తున్నామని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ తెలిపారు. ఆ రోజు ఉదయం 4 గంటల నుంచి రాత్రి ప్రయాణికుల రద్దీ ఉన్నంత వరకు దాదాపు 15 బస్సు సర్వీసులను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మరికొన్ని సర్వీసులను నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు ఈ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గురుకులం ప్రవేశ పరీక్ష ప్రశాంతం

నెల్లిమర్ల: పట్టణంలోని రెండు కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఐదో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి పరీక్ష నిర్వహించారు. బాలికల పాఠశాల కేంద్రంలో 201 మందికిగాను 180 మంది, మత్స్యకార బాలుర పాఠశాలలో 44 మందికి 38 మంది హాజరయ్యారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ కేబీబీ రావు, కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

ఆటాడుకుందాం రా..!

- మే 1 నుంచి జిల్లాలో వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు
- నెల రోజుల పాటు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- ఒక్కో శిబిరానికి రూ.7వేలు కేటాయించిన శాప్
- 50 శిబిరాల్లో శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ



శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

విజయనగరం: వేసవి వచ్చిందంటే చాలు పిల్లలకు ఆటలు గుర్తుకొస్తాయి. ఏడాదంతా పుస్తకాలు, ప్రాజెక్టులు, పరీక్షలు అంటూ ఒత్తిడిలో ఉన్న విద్యార్థులు వార్షిక పరీక్షలు ముగిసిన తర్వాత సేదదీరుతుంటారు. వేసవి సెలవుల్లో స్వేచ్ఛాయుత వాతావరణంలో గడపడాలని ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. కొందరు చిన్నారులు సెల్‌ఫోన్‌లు, టీవీలకు అతుక్కుపోతున్నారు. వారి దృష్టిని మళ్లించి క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు శాప్ ఆధ్వర్యంలో ఏటా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. మే 1 నుంచి 31 వరకు జిల్లాలోని 50 నిర్దిష్ట ప్రాంతాల్లో నిర్వహించేందుకు శిక్షకులను నియమించనున్నారు. ఇందుకోసం ఒక్కో శిబిరానికి రూ.7,000 చొప్పున కేటాయించనున్నారు. ఈ మొత్తంలో శిక్షకుడికి రూ.2,000 ఇవ్వనుండగా..మిగిలిన రూ.5000తో క్రీడా సామగ్రి, మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించనున్నారు.

నెలరోజుల పాటు నిర్వహణ

జిల్లాలో పాఠశాల విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు వేలాదిగా ఉన్నారు. వారిలో ఔత్సాహికులైన బాలబాలికలకు నెల రోజులపాటు పలు ఆటల్లో శిక్షణ ఇవ్వాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిర్ణయించింది. ఇందుకోసం శిక్షకులను ఎంపిక చేసింది. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు శిక్షణ నిర్వహిస్తారు. వేసవి సెలవుల్లో ఖాళీగా ఉండే విద్యార్థులు వారికి ఇష్టమైన ఆటలు ఆడి నెల రోజులపాటు నైపుణ్యం సాధించవచ్చు.

వివిధ అంశాల్లో తర్ఫీదు..

ఓ వైపు చదువుతో పాటు మరో వైపు క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఏడాది వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా 16 సంవత్సరాలలోపు వయస్సు గల బాల, బాలికలకు అవకాశం కల్పిస్తారు. విద్యార్థులు వారికి ఇష్టమైన క్రీడా రంగంలో శిక్షణ పొందేందుకు ఇదో సువర్ణావకాశం. ఆర్చరీ, అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, షటిల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, ఫెన్సింగ్, హ్యాండ్‌బాల్, ఖోఖో, కబడ్డీ, కరాటే, సాఫ్ట్‌బాల్, తైక్వాండో, వాలీబాల్, రెజ్లింగ్ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఏఏ ప్రాంతాల్లో..ఏ క్రీడాంశంలో శిక్షణ ఇస్తారనేది జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ప్రకటించనుంది.

యాప్‌లో వివరాల నమోదు..

శిబిరాలు పారదర్శకంగా జరగాలనే ఉద్దేశంతో శాప్ ప్రత్యేకంగా క్రీడా యాప్‌ను రూపొందించింది. ఆ యాప్‌లో సమగ్ర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని ఇప్పటికే అధికారులకు సూచించారు. శిబిరాలు పెట్టే ప్రదేశం, క్రీడాంశం, విద్యార్థులు, శిక్షకుల వివరాలు, గౌరవ వేతనం, ఉపకరణాల పంపిణీ, ప్రశంసా పత్రాల అందజేత తదితర వివరాలను కచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తే ఆ వివరాలు కూడా పొందుపరచవచ్చు.

50 శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు



స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల నేపథ్యంలో జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేశాం. జిల్లా మొత్తంగా 50 శిబిరాలు ఏర్పాటు చేయనున్నాం. ఈ మేరకు క్రీడాసంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయల నుంచి దరఖాస్తులు ఆహ్వానించాం. ఎంపిక చేసిన ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహిస్తాం. ఒక్కో శిబిరానికి రూ.7వేలు మంజూరు చేయనున్నారు.

ఎస్.వెంకటేశ్వరరావు,జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి, విజయనగరం

నేడు నగరపంచాయతీ చైర్మన్ ఎన్నిక

పాలకొండ: పాలకొండ నగరపంచాయతీ చైర్మన్ ఎన్నికను మరోమారు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. సోమవారం ఉదయం 10 గంటలకు జేసీ శోభిక ఆధ్వర్యంలో ఎన్నిక జరిపించనున్నారు. ఇప్పటికే పలుమార్లు ఎన్నిక వాయిదా పడిన నేపథ్యంలో సోమవారం జరగనున్న ఎన్నికపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. చైర్మన్ పీఠం ఎలాగైనా సొంతం చేసుకునే ప్రయత్నంలో మూడుసార్లు భంగపాటుకు గురైన కూటమి నాయకులు మరో మారు తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. వాస్తవానికి కూటమికి ఇక్కడ సభ్యుల బలం లేదు. 20 మంది కౌన్సిలర్లు ఉంటే అందులో చైర్మన్ రాజీనామా చేయడంతో 19 మంది ఉన్నారు. అందులో వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన వారు 17మంది కాగా కేవలం కూటమికి ముగ్గురు మాత్రమే కౌన్సిలర్లు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఇద్దరు కౌన్సిలర్లు మాత్రమే కూటమిలో చేరారు. అప్పటికీ కూటమికి చైర్మన్ పదవి వచ్చే అవకాశాలు కనిపించడంలేదు. ప్రస్తుతం ఎన్నికల నిబంధనలు మార్పు చేసి చైర్మన్ కుర్చీ దక్కించుకునేందుకు కూటమి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. చైర్మన్ పదవి ఎస్సీకి రిజర్వేషన్ కావడంతో ఆ ప్రాప్తికి ఒకే సభ్యురాలు ఉన్నారు. ఆమె కూడా వైఎస్సార్‌సీపీ బీ ఫాంతో గెలిచిన వ్యక్తి కావడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో సోమవారం జరగనున్న ఎన్నికపై అంతటా చర్చ సాగుతోంది.

బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్లు సిద్ధం



బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

- వచ్చే నెల 2 నుంచి కాకినాడలో రాష్ట్ర స్థాయి పోటీలు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్త్రీ, పురుషుల బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లిమర్ల మండలం చంపావతి నదీ తీర ప్రాంతంలో నిర్వహించిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వారికి జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కేవీ ప్రభావతి ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది స్త్రీ, పురుషులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 2 నుంచి 4 వరకు కాకినాడలో జరగనున్న 12వ రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఎంపిక పోటీలను జిల్లా కబడ్డీ అసోసియేసన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నడిపేన లక్ష్మణరావు, ట్రెజరర్ శివ, వ్యాయామ ఉపాధ్యాయులు తాడు బాబు, శ్రీను, గోపాల్, భాను, తిరుపతిరావు, ఆదిబాబు, వెంకటరావులు పర్యవేక్షించారు.

పట్టుబడిన గంజాయి

కొమరాడ: మండలంలోని కూనేరు చెక్ పోస్టు వద్ద 850 గ్రాముల గంజాయి ఆదివారం పట్టుబడినట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా సరిహద్దు గ్రామం కెరడకు చెందిన రౌతు దీనబంధ్, పార్వతీపురం పట్టణానికి చెందిన బర్ల కామేష్ ఒడిశా నుంచి పార్వతీపురం స్కూటీపై వస్తుండగా ముందస్తు సమాచారం మేరకు కూనేరు చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేయడంతో గంజాయితో పట్టుబడినట్లు చెప్పారు. వారి వద్ద గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఇరువర్గాలపై కొట్లాట కేసు నమోదు



రిమ్స్‌లో బాధితులను పరామర్శిస్తున్న రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం గ్రామంలో శనివారం రాత్రి జరిగిన కొట్లాటలో ఇరు వర్గాల వారి పరస్పర ఫిర్యాదుల మేరకు రెండు కేసులు నమోదు చేశామని ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం 15 రోజుల క్రితం పక్కపక్క పొలాలు గల ముగడ సూర్యనారాయణ పొలం గట్టుపై ఉన్న చెట్టును కొల్లి మురళి కొట్టడంతో ఇరు కుటుంబాల మధ్య మాటామాట పెరిగి శనివారం రాత్రి కొట్లాట జరిగింది. ఈ కొట్లాటలో 9 మందికి గాయాలవడంతో ముగడ గణేష్ వైజాగ్ కేజీహెచ్‌లో, ముగడ సూర్యనారాయణ, ముగడ రామకృష్ణ, ముగడ సత్యంలు, కె.బంగార్రాజులు శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో, కొల్లి శ్రీను, కొల్లి పవన్, కొల్లి మణికంఠలు రాజాంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ముగడ రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 13 మందిపై, కొల్లి పవన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు. శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సంతకవిటి ఎస్సైతో కలిసి రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు పరామర్శించి కొట్లాటకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ఐపీఎల్‌లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం ఉండాలి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



క్రీడాకారులకు స్కాలర్ షిప్ అందజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం: ఐపీఎల్ స్థాయిలో ఆడేవిధంగా జిల్లాలోని క్రీడాకారులు తయారు కావాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఆదివారం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జోనల్, రాష్ట్ర స్థాయిలో ఆడి,విజేతలుగా నిలిచిన క్రీడాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మైదానం, క్రీడా సౌకర్యాలను వినియోగించుకుని మంచి ప్రతిభ కలిగిన క్రీడాకారులుగా తయారుకావాలని పిలుపునిచ్చారు. ఐపీఎల్‌లో మన జిల్లా క్రీడాకారులు ఆడాలని, తన కోరిక నెరవేర్చాలని పిలుపునిచ్చారు. మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు మాట్లాడుతూ ఎన్‌టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. క్రీడా మైదానాలు చిల్లర కొట్టు మాదిరిగా తయారయ్యాయని అసహనం వ్యక్తం చేశారు. ఉన్న క్రీడా సౌకర్యాలను వినియోగించుకుని మంచి భవిష్యత్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ చరిత్ర కలిగిన మైదానం విజ్జీ క్రీడా మైదానం పేరు నిలబెట్టే విధంగా అందరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రాంబాబు, మాజీ క్రీడాకారులు, అసోసియేషన్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతి కేసు నమోదు

పాచిపెంట: మండలంలోని తంగ్లాం పంచాయతీ పూలగుడకు చెందిన పోయి అప్పలస్వామి (55) మరణంపై ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసు నమోదుచేసినట్లు పాచిపెంట పోలీసులు తెలిపారు. అప్పలస్వామి భార్య అప్పలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అప్పలస్వామి తంగ్లాం గ్రామంలో ఈ నెల 25న ఓ పెళ్లికి హాజరయ్యాడు. ఆ పెళ్లిలో అప్పలస్వామికి, ప్రక్క గ్రామమైన పనసలపాడుకు చెందిన పోయి రాజుతో గొడవ జరగగా గ్రామస్తులు గొడవను విడిపించారు. అయితే పెళ్లి నుంచి ఆ రాత్రి గ్రామానికి బయల్దేరి ఇంటికి రాకపోవడంతో ఉదయాన్నే అప్పలమ్మ తంగ్లాం గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో అప్పలస్వామి ముఖం మీద గాయాలతో మరణించి ఉండడాన్ని గమనించి, ఈ విషయాన్ని తంగ్లాం గ్రామస్తులకు తెలియజేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భర్త మరణంపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొనగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏపీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యవర్గం ఏర్పాటు



నూతనంగా ఎన్నికైన ఏపీయూడబ్ల్యూజేఎఫ్ కార్యవర్గం

పార్వతీపురంటౌన్: ఏపీయూడబ్ల్యూజేఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో నియమించారు. పూర్తిస్థాయి జిల్లా కమిటీ ఏర్పాటుతో పాటు కురుపాం, పార్వతీపురం, సాలూరు, పాలకొండ నియోజక వర్గాల కార్యవర్గాల ఏర్పాటుకు కమిటీ తీర్మానించింది. అంతవరకు అడహాక్ కమిటీ అధ్యక్షుడిగా డీఎస్‌ఆర్ పట్నాయక్, కార్యదర్శిగా కేవీ నారాయణరావు నాగు, ఉపాధ్యక్షుడిగా తలేన వీస్, కోశాధికారిగా అంటిపేట సోమశేఖర్, సంయుక్త కార్యదర్శిగా సాలాపు ప్రసాద్‌తో పాటు పదిమంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర కమిటీ సభ్యులతో కలిసి నియోజకవర్గాల్లో పర్యటించి కమిటీల ఏర్పాటుతోపాటు సంఘాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు కార్యవర్గ సభ్యులు తెలిపారు.

పెరుగుతున్న పాముకాటు బాధితులు

- పంటపొలాలు, ఆరుబయట నిద్రిస్తున్న వారికే ప్రమాదం
- సకాలంలో ఆస్పత్రికి చేర్చితే కాపాడవచ్చంటున్న వైద్యులు



విజయనగరం ఫోర్ట్: గుర్ల మండలం బుర్లిపేటకు చెందిన ద్వారపూడి మౌనిక (17) కొద్ది రోజుల క్రితం ఇంటి ముందు కుర్చీలో కూర్చుని ఫోన్ చేస్తుండగా పాము కాటువేసింది . కుటుంబసభ్యులు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తీసుకు వెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందింది.

- గంట్యాడ మండలం బుదరపాడుకు చెందిన చుక్క రాంబాబు (39) పొలంలో గడ్డి చేసుకు నీరు పెట్టడానికి వెళ్లగా పాము కాటువేసింది. కుటుంబసభ్యులు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.
- జిల్లాలో అనేక మంది పాముకాటు బారిన పడుతున్నారు. వారిలో కొంతమంది మత్యువాతపడుతుండగా మరికొంతమంది బతికి బట్టకడుతున్నారు. వ్యవసాయ పనులకు రైతులు వెళ్లేటప్పుడు, కూరగాయలు కోసేటప్పుడు, పంటపొలాలకు నీరు కట్టేందుకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఆ సమయాల్లోనే ఎక్కువగా పాముకాటు బారిన పడే ప్రమాదం ఉంది.

పంట పొలాల్లోనే ఎక్కువ:

సాధారణంగా నిర్జీవ ప్రదేశాలను ఎక్కువగా ఇష్టపడే పాములు ఆహారం కోసం జనారణ్యంలోకి చొచ్చుకువస్తున్నాయి. చెత్తా చెదారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, పాడుబడిన భవన శిథిలాలు, పూరిగుడిసెలు, గుబురుగా ఉండే పంటచేలల్లో ఎక్కువగా నివసిస్తాయి. ఎలుకలను, కప్పలను ఎక్కువగా ఇష్టపడే పాములు పొలాల్లో రాత్రి పూట సంచరిస్తూ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పొలాల్లోనూ, ఆరుబయట నిద్రిస్తున్న వారు ఎక్కువగా పాముకాటుకు గరవుతున్నారు.

వేసవిలోనూ తప్పని బెడద

సాధారణంగా వర్షాకాలంలో ఎక్కువగా పాముల బెడద ఉంటుంది. కానీ ప్రస్తుతం వేసవికాలంలో కూడా పాముల బెడద ఎక్కువగా ఉంటోంది.

పాములపై అవగాహన ఉండాలి

గ్రామీణ ప్రాంతాల్లో ఉండే రైతులకు పాములపై కనీస అవగాహన అవసరమని వైద్యులు అంటున్నారు. కనిపించే పాములన్నీ విషపూరితం కాదు. కట్లపాము, తాచుపాము, రక్తపింజర, నాగుపాము వంటి 15 శాతం పాములతోనే ముప్పు ఉంది. సరైన సమయంలో చికిత్స పొందితే విషసర్పం కరిచినా ప్రాణపాయం నుంచి తప్పించుకోవచ్చని వైద్యులు ధైర్యం చెబుతున్నారు.

జాగ్రత్తలు తప్పనసరి

రాత్రి వేళ పొలాలకు వెళ్లేటప్పుడు చెప్పులు, టార్చిలైట్లుతో పాటు శబ్దం చేసే పరికరాలు వెంట తీసుకుని వెళ్లడం మంచిది. పాముకాటుకు గురైన వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తీవ్ర ఒత్తిడికి గురైతే బీపీ పెరగడంతో పాటు గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. పసర వైద్యం, మంత్రాలు అంటూ అలసత్వం వహిస్తే ప్రాణాలకే ప్రమాదం. పాముకాటు వేయగానే పైభాగం గుడ్డతో కట్టాలి. కాటు వేసిన భాగాన్ని కొత్త బ్లేడుతో గాటు వేసి రక్తాన్ని నోటితో లాగేయాలి. నోటి గాయాలు ఉన్న వారు ఇలా చేయకూడదు. ప్రాథమిక వైద్యం అందించిన వెంటనే ఆస్పత్రికి తీసుకు వెళ్లాలి. కరిచిన పాము ఏదో తెలుసుకుంటే చికిత్స అందించడం సులభమవుతుంది.

సకాలంలో ఆస్పత్రికి తీసుకువస్తే..

పాము కాటు బాధితులను సకాలంలో ఆస్పత్రికి తీసుకురాగలిగితే ప్రాణాలు కాపాడడానికి అవకాశం ఉంటుంది. సీహెచ్‌సీల్లోనూ, ఏరియా ఆస్పత్రుల్లోనూ, ఏఎస్‌వీ(యాంటీ స్నేక్ వీనమ్) అందుబాటులో ఉన్నాయి.

డాక్టర్ ఎస్.పి.పద్మశ్రీ రాణి, డీసీహెచ్‌ఎస్

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



60 అడుగుల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న భక్తులు

విజయనగరం టౌన్: స్థానిక పూల్ బాగ్ లక్ష్మీగణపతికాలనీలో కొలువైన శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం వద్ద కొలువైన 60 అడుగుల శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయవ్యవస్థాపకుడు సుబ్రహ్మణ్యస్వామి ఉపాసకుడు కర్రి వెంకటరమణ సిద్ధాంతి ఆధ్వర్యంలో పాలాభిషేకం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కనుల పండువగా నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బేతా కృష్ణారావు, కార్యదర్శి ఇసరపు శ్రీనివాస గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు దువ్వ శ్రీనివాసరావు, బెహరా కూర్మారావు, దన్నాన రామమూర్తి, అర్చకులు శ్రీనివాసశర్మ, సభ్యులు సముద్రాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు తోండ్రంగి విద్యార్థిని



క్రీడాకారిణి జాహ్నవిని అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

చీపురుపల్లిరూరల్(గరివిడి): దేశ రాజధాని న్యూఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి ఖోఖో పోటీలకు తోండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రౌతు జాహ్నవి ఎంపికైంది. మే 1 నుంచి 5 వరకు జరగనున్న 68వ స్కూల్‌గేమ్స్ పోటీల్లో అండర్-19 విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున జాహ్నవి ప్రాతినిధ్యం వహించనుంది. ఈ క్రీడాకారిణి జనవరిలో చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టులో స్థానం సాధించింది. ఈ సందర్భంగా జాహ్నవిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.రమేష్‌కుమార్, పీడీ సత్యనారాయణ అభినందించారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం



ప్రమాదంలో ధ్వంసమైన లారీలు

బొండపల్లి: మండలంలోని నెలివాడ జాతీయ రహదారి 26పై సోమవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు బలంగా ఢీకొన్నాయి. అయితే అదృష్టవశాత్తు త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. గజపతినగరం నుంచి విజయనగరం వెళ్తున్న లారీ.. విజయనగరం నుంచి సాలూరు వెళ్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లారీల ముందు భాగాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రమాదంలో లారీల డ్రైవర్లు స్వల్ప గాయాలుతో బయటపడగా,పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

సాహిత్యం, కళలను ప్రోత్సహిస్తాం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- పాడుదుమా.. స్వేచ్ఛాగీతం పుస్తకావిష్కరణ

విజయనగరం టౌన్: సాహిత్యం, కళలకు ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా నిలుస్తానని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు రాసిన పాడుదుమా.. స్వేచ్ఛాగీతం పుస్తకాన్ని సాహితీ వేత్తలతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలకు పుట్టినిల్లు అయిన గురజాడ, ద్వారం, ఘంటసాల, సుశీలమ్మ వంటి ఉద్దండులు నడయాడిన ఈ నేల ఎంతో ప్రశస్తమైనదని కొనియాడారు. సాహిత్యాన్ని, కళలను భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తమ వంతుగా వీటిని నిరంతరం ప్రోత్సహిస్తున్నామని, భవిష్యత్తులోనూ కొనసాగుతుందని హామీనిచ్చారు. గంటేడ రాసిన పుస్తకాన్ని జెడ్పీ పాఠశాలల్లో, గ్రంథాలయాల్లో విద్యార్థుల కు అందుబాటులో ఉంచుతామన్నారు. ఉత్తరాంధ్ర కవులు, కళాకారులకు సముచిత గౌరవాన్ని కల్పించేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. సాహితీ స్రవంతి నిర్వహకులు చీకటి దివాకర్, చంద్రికారాణిల ఆధ్వర్యంలో వారి కుమారుడు రవితేజ, కోడలు వైష్ణవిల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వినూత్నంగా సాహితీ కార్యక్రమాన్ని నిర్వహించారు.